



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 300 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 17-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

### చంద్రబాబుతో బిల్‌గేట్స్
## బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

- శ్రీవారి విశిష్టతను వివరించిన చంద్రబాబు
- ఇంట్లోని నిలువెత్తు విగ్రహం చూపించిన బాబు
- వ్యవసాయ క్షేత్రం సదర్శించి పంటలపై ఆసక్తి





**అమరావతి, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు కురిపించారు. 'నైస్, గుడ్, గ్రేట్ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలంటూ గేట్స్ కొనియాడారు. గేట్స్‌పై ఉన్న గౌరవంతో మంత్రి నారా లోకేశ్‌తో సహా నలుగురు మంత్రులను సీఎం చంద్రబాబు -మిగతా 2 లో

### గందరగోళంగా మున్సిపల్
# చైర్మన్ల ఎంపిక

**మెజార్టీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు హస్తగతం**


- ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగా
- హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం
- ఎక్స్ అఫీషియో సభ్యుల బలంతో కాంగ్రెస్ పైచేయి
- ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్
- కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ప్రకటన
- కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బీజేపీ
- కోరం లేక 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా



**హైదరాబాద్,ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణలో మున్సిపల్ చైర్మన్లు, వైఎస్ చైర్మన్ల ఎన్నికలో తీవ్ర గందరగోళం నడిచింది. పలుచోట్ల ఫిరాయింపులు చోటుచేసుకున్నాయి. అత్యధిక సీట్లు సాధించినా కొన్నిచోట్ల ఎక్స్ ఆఫీషియో సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ పలు మున్సిపాలిటీలను సొంతం చేసుకుంది. జనగామ, తొర్రూరు తదితర ప్రాంతాల్లో గందరగోళం వల్ల ఎన్నికను వాయిదా వేశారు. ఇకపోతే అధికార కాంగ్రెస్ పార్టీ అన్నిచోట్లా ఆధిక్యం ప్రదర్శించింది. హంగ్ ఏర్పడిన చోట్ల పైచేయి సాధించింది. సిఎం రేంవత్ ఆదేశాలతో కాంగ్రెస్ -మిగతా 2 లో

### రష్యా నిర్ణయంపైనే
## బంగారం ధరలు

- డాలర్‌తో వాణిజ్యం కొనసాగితే తగ్గనున్న పసిడి
- అంతర్జాతీయ నిపుణుల వెల్లడి




**న్యూఢిల్లీ,** అంతర్జాతీయ పరిస్థితులు బంగారాన్ని కంట్రోల్ చేస్తున్నాయి. రష్యా రూబుల్‌తో వ్యాపారం కారణంగా పరిస్థతి దిగజారిందని అంటున్నరు. తిరిగి రష్యా డాలర్‌తో వ్యఆరాన్ని పునరుద్దరిస్తేనే బంగారం రేట్లు దిగి వస్తాయని అంటున్నారు. బంగారం అంటే ఇష్టపడేవారికి పండగలాంటి అంచనాను నిపుణులు వెలువరించారు. ఇప్పడు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షన్నర పైగా ఉండగా, ఇది రూ.లక్ష లోపునకు రావచ్చని.. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్ల వద్ద కదలాడుతుండగా, 3,000 డాలర్లకు దిగిరావచ్చని అంచనా -మిగతా 2 లో

## శబరిమల తదితర ప్రాంతాల్లో మహిళలకు ప్రవేశం

- విచారణకు 9మంది న్యాయమూర్తులతో ధర్మాసనం
- ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు సుప్రీం విచారణ



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన 67 పిటిషన్లపై త్వరలో విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. పలు మతపరమైన ప్రదేశాలలో మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు -మిగతా 2 లో



### నేటి నుంచి హైటెక్స్ వేదికగా
## బయో ఏషియా సదస్సు

- రెండ్రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సు
- సదస్సును ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,** తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ఆటోమేషన్ వంటివి లైఫ్ సైన్సెస్ , హెల్త్‌కేర్ రంగాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొంటారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ -మిగతా 2 లో



## పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

- ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజల తీర్పు
- రాజకీయాలకు అతీతంగా మధిర అభివృద్ధి
- మధిరలో మీడియాతో డిప్యూటి సిఎం భట్టి

**ఖమ్మం ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనవిజయంపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మధిరలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా పట్టణాల్లో కాంగ్రెస్‌కు ఈ స్థాయిలో ప్రజలు పట్టం కట్టడం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమం , ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. -మిగతా 2 లో

### కరీంనగర్‌పై
# బీజేపీ జెండా

**34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని కమలదళం కైవసం**

- మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నిక
- డిప్యూటి మేయర్‌గాసునీల్ రావు ఎంపిక
- కాంగ్రెస్ మేయర్ అభ్యర్థికి 21 మంది కార్పొరేటర్లు మద్దతు
- బీజేపీకి లాభించిన బీఆర్ఎస్ తటస్థ వైఖరి
- దీంతో మొదటి సారి కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం




**కరీంనగర్,ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తీవ్ర ఉత్కంఠ రేపిన కరీంనగర్ కార్పొరేషన్‌ను భాజపా దక్కించుకుంది. మేయర్ పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ వేసిన పాచిక పారలేదు. దీంతో కరీంనగర్ పట్టణ మేయర్‌గా ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని కమలదళం కైవసం చేసుకుంది. డిప్యూటీ మేయర్‌గా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు ఎన్నికయ్యారు. -మిగతా 2 లో



### ఇక ఈ అవమానాన్ని
## భరించలేను

- పార్టీలో కొనసాగడం కష్టంగానే ఉంది
- జగిత్యాలను బిఆర్ఎస్ ఎమ్మెల్యేకు రాసిచ్చారు
- మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆవేదన

**జగిత్యాల,** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ ఏంటో గోచరించడం లేదని, అవమానాలు ఇంకెంతకాలం భరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గాల మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నప్పటికీ.. ఛైర్మన్ పదవి ఎవరికి ఇస్తారన్న దానిపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలోనే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులు క్యాంప్ రాజకీయాలు చేశారు. చివరికి సంజయ్ వర్గానికి చెందిన వ్యక్తి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో జీవన్‌రెడ్డి అసహనానికి గురైనట్లు సమాచారం. ఈ ఎన్నిక ముగింపు కాదు.సోమవారం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంతకాలం నాకు వేధింపులు తప్పవు. పవర్ ఆఫ్ అటార్నీ ఎమ్మెల్యే సంజయ్‌కు రాసిచ్చారా అంటూ ఆవేదన చెందారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారలేదని స్పీకర్ అంటున్నారు. ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీతో సంసారం చేస్తున్నారు. -మిగతా 2 లో

## రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

- ఏడుగురు వ్యక్తుల సజీవ దహనం
- ప్రమాదంలో రూ.లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిద
- ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం



**జయపుర,** రాజస్థాన్‌లో భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీ లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని కర్మాగారాల్లో పని చేస్తున్నవారిని ఖాళీ చేయించామన్నారు. -మిగతా 2 లో

### నేడు ప్రధాని మోడీతో
## ఫ్రాన్స్ అధ్యక్షుడి భేటీ

- ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపైనా, ప్రాంతీయ ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై చర్చలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ మంగళవారం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. మాక్రాన్ భారత్ పర్యటన సందర్భంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపైనా, ప్రాంతీయ ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై చర్చలు జరపనున్నారు. రేపు మోడీ, మాక్రాన్‌లు ముంబయిలో కలవనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. -మిగతా 2 లో

### చంద్రబాబుతో బిల్‌గేట్స్
# బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

మొదటి తరువాయి

గన్నవరం విమానాశ్రయానికి పంపించి స్వాగతం పలికారు. సచివాలయంలో మొదటి బ్లాకులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబును చూడగానే కారు దిగుతూనే 'హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ'.. అంటూ ముఖ్యమంత్రిని పలకరించారు గేట్స్. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సహా ఇతర క్యాబినెట్ మంత్రులను బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు పరిచయం చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సందర్భంగా తన ఛాంబర్‌లోకి వచ్చిన బిల్‌గేట్స్‌కు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్రపటాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించారు. శ్రీవారి ప్రాశస్త్యాన్ని, తిరుమల క్షేత్రం గొప్పదనాన్ని బిల్ గేట్స్‌కు వివరించారు సీఎం. గేట్స్ ఫౌండేషన్ బృందంతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం ఆర్టీజీ సెంటర్‌కు గేట్స్‌ను తీసుకెళ్లారు ముఖ్యమంత్రి. తర్వాత ఆ విభాగం పనితీరును వివరించారు. పాలనా వ్యవహారాలు, విపత్తుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విషయంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏ విధంగా వినియోగించుకుంటున్నా మనే అంశాన్ని ఉదాహరణలతో సహా వివరించారు ముఖ్యమంత్రి. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టు ప్రోగ్రెస్‌ను ముఖ్యమంత్రి వివరించగా.. దట్స్ నైస్ అంటూ మెచ్చుకున్నారు బిల్ గేట్స్. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై గ్రేట్ అంటూ గేట్స్ అభినందనలు తెలిపారు. డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడంపై బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే అందించగలిగితే.. పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అమరావతి రాజధాని ప్రణాళికలను.. బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్‌ను, అత్యాధునిక పద్ధతుల్లో ఫ్యూచర్ సిటీగా నిర్మిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. గ్రేట్‌వర్క్ అంటూ రాజధాని మాస్టర్ ఎ÷-లాన్‌ను మెచ్చుకున్నారాయన. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి ప్రణాళికలతో రాజధాని నిర్మిస్తున్నామనే విషయాన్ని వివరించారు సీఎం. రాజధాని ప్రాంతంలో మొత్తంగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించే దిశగా.. ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు బిల్ గేట్స్‌కు చెప్పారు సీఎం. అనంతరం మంత్రులు, సెక్రటరీల సమావేశానికి గేట్స్‌ను తీసుకొచ్చారు సీఎం చంద్రబాబు. ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలు, లక్ష్యాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే ఉండవల్లిలోని వ్యవసయా క్షేత్రాన్ని పరివృలించారు. అక్కడ పండించిన పంటలను పరిశీలించి అభినందించారు.

## శబరిమల తదితర ప్రాంతాల్లో మహిళలకు ప్రవేశం

మొదటి తరువాయి

ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టడానికి ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు రెండు వారాల సమయం కేటాయిస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం ప్రకటించింది. ఈ అంశంపై ఏప్రిల్ 7న ఉదయం 10.30 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని తెలిపింది. శబరిమలతో పాటు దర్గాలు, మసీదుల్లోకి ముస్లిం మహిళల ప్రవేశం, ఇతర మతస్థుల్ని పెళ్లాడే పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవడం వంటి అంశాల పైనా విచారణ జరపనుంది. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటుచేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మరో కొత్త ధర్మాసనంతో దీనిపై విచారణ జరపనున్నట్లు తెలిపారు.

## నేటి నుంచి హైటెక్స్ వేదికగా బయో ఏషియా సదస్సు

మొదటి తరువాయి

ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు. వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు , ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్ట్స్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్.. డేటా అనలిటిక్స్ , ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్-క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌గా మార్చే రోడ్‌మ్యాప్. ఆర్ / డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్ , కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్‌బయో' హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.


## పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

మొదటి తరువాయి

రాష్ట్రంలోని సుమారు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ అత్యంత బలంగా ఉందని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పట్టణ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషికి ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఏకపక్షంగా గెలిపించిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, ప్రభుత్వం మరింత బాధ్యతగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి, పట్టణ ప్రజల రుణం తీర్చుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఇందుకోసం పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పన , ఉద్యోగాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా 'డెవలప్మెంట్ కమిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 'నో పాలిటిక్స్.. ఓన్లీ డెవలప్మెంట్ అనే నినాదంతో ముందుకు సాగుతామని, ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# గందరగోళంగా మున్సిపల్ చైర్మన్ల ఎంపిక

మొదటి తరువాయి



వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. నిజామబాద్ కార్పోరేషన్ను కైవసం చేసుకుంది. మొత్తం ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు సోమవారం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక జరిగింది. మెజార్టీ ఛైర్మన్లు, వైస్ ఛర్మన్లు హస్తగతం అయ్యాయి. ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగా వేసింది. హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం ఫలితాన్ని సాధించింది. ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్, కొత్తగూడెంలో సిపిఐకి మద్దతు ప్రకటించింది. కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బిజెపి నిజామాబాద్‌లో ఖంగు తింది. కరీంనగర్, నిజామాబాద్,రామగుండం, మహబూబ్‌నగర్, నల్లగొండ, మంచిర్యాల, కొత్తగూడెం కార్పొరేషన్లకు మేయర్, డిప్యూటీ మేయర్లను ఎన్నుకున్నారు. ఆయా కార్పొరేషన్లలో ఎన్నికైన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్: కొలగాని శ్రీనివాస్ (బీజేపీ),డిప్యూటీ మేయర్: వై.సునీల్ రావు (బీజేపీ) ఎన్నియ్యారు. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్: ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్మాతాహిన్ (ఏఐఎంఐఎం) ఎన్నికయ్యారు. ఇక్కడ ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌పై పాగా వేశారు. నిజానికి బిజెపి మెజార్టీ సీట్లు సంపాదించిన లాభం లేకుండా పోయింది. రామగుండం కార్పొరేషన్‌లో మేయర్: మహంకాళి స్వామి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: పాతిపల్లి ఎల్లయ్య (కాంగ్రెస్)లు ఎన్నియ్యారు. నల్గొండ కార్పొరేషన్ మేయర్: ముర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్ (ఏఐఎంఐఎం)లు ఎన్నికయ్యారు. మంచిర్యాల కార్పొరేషన్ మేయర్: ధరణి మధుకర్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్ల రమ్య మహేశ్ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్: మూడ్ గణెళిశ్ (సీపీఐ)డిప్యూటీ మేయర్: సిరిపురపు లలిత కుమారీ (కాంగ్రెస్) ఎన్నికలయ్యారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులుపై సీపీఐ, కాంగ్రెస్ ఒప్పందం చేసుకున్నాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్గా గుమల్ మమత (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: ఎం సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా 11 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌ఎన్నికలు వాయిదా పడ్డాయి. పలుచోట్ల బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవానికి గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక పాలకమండలి ఎన్నికను వాయిదావేస్తున్న ట్లు అధికారులు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఇంద్రేశం, భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లందు, జనగామ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, నిర్మల్ జిల్లా ఖానాపూర్, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, ఇబ్రహీం పట్నం, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ బల్దియాలో చైర్మన్, వైస్ చైర్మనేపేర్లు ఇంకా ఖరారు కాలేదు. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడింది. 12 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు, ఒక్క ఇండి పెండెంట్ కౌన్సిలర్ మాత్రమే సమావేశానికి హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. మిగతా నలుగురు బీజేపీ సభ్యులు, నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైరాజరయ్యారు. దీంతో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. బీజేపి, బీఆర్ఎస్ ల మధ్య జరిగిన మంతనాలు సయోధ్య కుదరలేదని తెలుస్తోంది. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్‌ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సుమారు రెండు గంటలు సేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఉదయం 10.30గంటలు కు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాల్సిన కౌన్సిలర్లు..12.00 గంటల వరకు కూడా ఎవరు రాలేదు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మందమర్రి తహసీల్దార్, ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

# రష్యా నిర్ణయంపైనే బంగారం ధరలు

మొదటి తరువాయి

వేస్తున్నారు. రష్యా కనుక అమెరికా డాలర్లలో వాణిజ్యాన్ని పునఃప్రారంభించినప్పుడే, ఇది జరుగుతుందని పేర్కొంటున్నారు. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశంలో గతేడాది బంగారం, వెండి ధరలు శరవేగంగా దూసుకెళ్లాయి. ఏడాది వ్యవధిలోనే బంగారం ధర 70 శాతానికి పైగా పెరిగి, గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.80 లక్షలకు మించి గరిష్ఠస్థాయిని తాకినా, ప్రస్తుతం రూ.1.59 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయంగానూ ఔన్సు బంగారం ధర 5600 డాలర్లపైకి వెళ్లినా, మళ్లీ ఇప్పుడు 5000 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయ అనిశ్చితులు పెరగడంతో, సురక్షితమని భావిస్తూ బంగారంపైకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటమే ధరల వృద్ధికి కారణం. ఆ రెండు దేశాల మధ్య శాంతి చేకూర్చాలని, వచ్చే జూన్ కల్లా యుద్ధాన్ని నిలిపివేయాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సంప్రదింపులు జరిపారు. రష్యా చమురు కొనకుండా, భారత్ సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించడంతో, రష్యా కూడా దారికి వస్తున్న సూచనలున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు, అమెరికా డాలర్లలో వాణిజ్యం నిర్వహించేందుకు రష్యా సన్నాహాలు చేస్తున్నట్లు వార్తా ఏజెన్సీ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలు తేవాలన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సన్నాహాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బే. రష్యా కనుక అంతర్జాతీయ వాణిజ్య సెటిల్‌మెంట్లను డాలర్లలో నిర్వహిస్తే, అమెరికా కరెన్సీకి ఊపొస్తుంది. పసిడిపై పెట్టుబడులు మళ్లీ డాలర్‌కు చేరతాయి. అప్పుడు కేంద్రబ్యాంకులూ బంగారం కొనడం ఆపేస్తాయి. అంతర్జాతీయ పసిడి నిల్వల్లో 20? బ్రిక్స్ దేశాల వద్దే ఉన్నాయని అంచనా. బ్రిక్స్ దేశాలతో అనుబంధం ఉన్న దేశాల నుంచే, అంతర్జాతీయ పసిడి ఉత్పత్తిలో 50? వాటా ఉంది. ఇప్పుడీ దేశాలన్నీ బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నా, అతి తక్కువగా మాత్రమే విక్రయిస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదీ కారణమైంది. ఇప్పుడు మళ్లీ డాలర్‌కు మద్దతు పెరిగితే, అమెరికా బాండ్లకు గిరాకీ వస్తుంది. అందువల్ల బంగారంపై పెట్టుబడులు ఉపసంహరించడం ప్రారంభిస్తే ఔన్సు ధర 2027 ఆఖరుకు 3,000 డాలర్లకు దిగిరావ్చని సెబీ నమోదిత మార్కెట్ నిపుణులు అనుజ్ గుప్తా, అమిత్ గోయల్ వంటివారు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000-1,00,000 వద్ద స్థిరపడొచ్చని అంచనా వేస్తున్నారు.

# కరీంనగర్‌పై బీజేపీ జెండా

మొదటి తరువాయి

ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటించారు. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో భాజపా అత్యధికంగా 30 స్థానాల్లో గెలిచి నప్పటికీ మ్యాజిక్ సంఖ్యను చేరుకొని పీఠాన్ని కైవసం చేసుకుంటుందా.. అనే విషయంలో సందిగ్ధత కొనసాగింది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ రెండ్రోజుల క్రితం ధీమా వ్యక్తం చేసినా ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేపాయి. కాంగ్రెస్, భారాస, ఎంఐఎం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) సభ్యులు, స్వతంత్రులు కలిసి ఎలాగైనా కార్పొరేషన్‌ను తమకు అనుకూలంగా మలచుకోవాలనే విధంగా చక్రం తిప్పారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర శివారులోని ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు నిర్వహించారు. మేయర్ పదవి కోసం ఇరువర్గాలు భాజపా, కాంగ్రెస్ మధ్య సంఖ్యాపరంగా దోబూచులాట కొనసాగింది. చివరికి మేయర్ పీఠాన్ని భాజపా దక్కించుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థికి 21 మంది కార్పొరేటర్లు మద్దతు పలికారు. బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించింది. బీఆర్ఎస్ ఎటువైపు మొగ్గు చూపకుండా తటస్థంగా ఉండటంతో, బీజేపీ అభ్యర్థి 34 ఓట్లతో విజయం సాధించారు. దీంతో మొదటి సారి కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ దక్కించుకుంది.ఇటీవలి మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా.. బీజేపీ 30 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ 14 స్థానాలు, బీఆర్ఎస్ 9 స్థానాలు, స్వతంత్రులు 8 స్థానాలు, ఎంఐఎం 3 సీట్లు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రెండు స్థానాల్లో విజయం సాధించాయి. ఇక్కడ ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఈ ఫలితాలతో హంగ్ నెలకొన్నప్పటికీ.. స్వంతంత్రులు, ఇతరుల అభ్యర్థులతో బీజేపీ మేయర్ పదవిని దక్కించుకుంది.

## రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

మొదటి తరువాయి

ఈ ప్రమాదంలో సజీవదహనమైన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు కార్మికులు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. ప్రమాదంలో రూ.లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిదయ్యాయన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ప్రధాని నరేంద్ర మోదీ (ఖఓ ఓనీటతి) విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ దిగ్భారతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

### నేడు ప్రధాని మోడీతో
## ఫ్రాన్స్ అధ్యక్షుడి భేటీ

మొదటి తరువాయి

మధ్యాహ్నం 3.15 నిమిషాల నుంచి 5.15 నిమిషాల దాకా ముంయిలోని లోక్‌భవన్‌లో ఇద్దరు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్నారు.



### ఇక ఈ అవమానాన్ని
## భరించలేను

మొదటి తరువాయి



కార్యకర్తల మనోభావాలను పార్టీ అధినాయకత్వం గౌరవించాలి. జగిత్యాలలోనే ఇలా ఉంటే.. పార్టీ మారిన మరో 9 ప్రాంతాల్లో ఎలా ఉందో..అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక విషయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. తన ప్రతిపాదనను కాదని, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడంతో ఆయన కలత చెందారు. తన వర్గానికి చెందిన వ్యక్తికి కాకుండా.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేయడాన్ని ఆయన అవమానంగా భావిస్తున్నారు. నా గురించి, పార్టీతో నాకు ఉన్న అనుబంధం గురించి మీకు తెలుసు. పార్టీలో కొనసాగాలనే విషయంపై ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన ఎవరో వచ్చి మా మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు. మా హక్కులను కాలరాస్తున్నారు. మా కాంగ్రెస్ కార్యకర్తల హక్కులను కాపాడలేకపోతున్నా. ఈ క్షోభ ముగింపు కాదు. ఈ వేధింపులు భరిస్తూ పార్టీలో కొనసాగగలుగుతామా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ వేధింపులు భరించగలుగుతానా? ఎంత కాలం భరించగలుగుతాను? దీనికి పరిష్కారం ఏంటి? అని కూడా ఊహించలేకపోతున్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# ఫిబ్రవరి 19న తెలంగాణ ఉద్యమ నాయకురాలు వనం ఝాన్సీ రాణి వర్ధంతి

**అమ్రాబాద్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** :తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకురాలు వనం ఝాన్సీ రాణి వర్ధంతి కార్యక్రమం ఫిబ్రవరి 19న అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం 11 గంటలకు జరగనుంది. ఉద్యమకారుల గుండెచప్పుడు, ఆవేదనను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని, స్వర్గస్తులైన వనం ఝాన్సీ రాణి, బాల్ జంగయ్య, షేక్ హుస్సేన్‌లను అధికారికంగా ఉద్యమకారులుగా గుర్తించాలని నిర్వాహకులు కోరుతున్నారు. 1969 మే 6న పాలమూరు జిల్లా అచ్చంపేటలో జన్మించిన వనం ఝాన్సీ రాణి, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర రాజకీయాల్లో మహిళల్లోకానికి చైతన్యం కలిగించారు. రైతుల సమస్యలు, చేనేత కార్మికుల సమస్యలు, విద్య, వైద్యం, మహిళల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. తెలంగాణ రాష్ట్రం



కోసం విద్యార్థి సంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేశారు. 2009లో తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ప్రారంభమైనప్పుడు అచ్చంపేట ప్రాంతంలో విద్యార్థి సంఘాలతో కలిసి 100 రోజుల రిలే నిరాహార దీక్షలో పాల్గొని ఉద్యమాన్ని ముందుకు నడిపారు. 2011 ఫిబ్రవరి 19న అమంగల్ మండలంలోని కర్తాల్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె అమరులయ్యారు. ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, స్థలాలు, పెన్షన్‌లు కల్పించాలని నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమం కోసం త్యాగం చేసిన గద్దర్ వంటి మహానుభావుల స్ఫూర్తితో ఉద్యమకారుల హక్కుల సాధన కోసం కదలాలని పిలుపునిచ్చారు.

# హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్గా దండి లక్ష్మీ ఎన్నిక

**హుస్నాబాద్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు శాంతియుతంగా, ఘనంగా ముగిశాయి. 14వ వార్డు సభ్యురాలు దండి లక్ష్మీ పేరును చెన్నమేని అనూష ప్రతిపాదించగా, ఆకుల రజిత, కేశవేని రమేష్, శోభన్ బాబు తదితర సభ్యులు బలపరిచారు. సభ్యులందరి సంపూర్ణ సమ్మతితో ఆమెను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రత్యేక అధికారి ఆర్డీవో రామ్మూర్తి ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. బాధ్యతలు స్వీకరించిన దండి లక్ష్మీ మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేస్తానని, పారిశుద్ధ్యం, తాగునీరు,



రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. అదేవిధంగా వైస్ చైర్‌పర్సన్ పదవికి 7వ వార్డు సభ్యుడు చిత్తారి పద్మ రవీందర్ పేరును పిల్లి తిరుపతి ప్రతిపాదించగా, వర ప్రసాద్, బొలిశెట్టి రాజు, వైద్యం కిరణ్ ప్రసాద్ తదితర సభ్యులు బలపరిచారు. సభ్యులందరి సమ్మతితో ఆయనను కాంగ్రెస్ పార్టీ తరఫున హుస్నాబాద్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రత్యేక అధికారి ఆర్డీవో రామ్మూర్తి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. బాధ్యతలు స్వీకరించిన చిత్తారి పద్మ రవీందర్ మాట్లాడుతూ, ప్రజల నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తూ, చైర్‌పర్సన్‌తో కలిసి మున్సిపాలిటీ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తానని, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్ల నిర్మాణం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

# మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మత్తులు

**హుస్నాబాద్ ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వేసవి కాలంలో తలెత్తే తాగునీటి ఎద్దడిని ముందుగానే నివారించేందుకు చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో ఎంపిడిఓ విజయ్ కుమార్, ఎంపీఓ ఖాజా మోయినుద్దీన్, ఏఈ జ్ఞానేశ్వరి, కార్యదర్శి జ్యోతి, పంపు డ్రైవర్ వెంకటేశ్వర్లు, గ్రామ ప్రజలు కలిసి పలు ప్రాంతాలను సందర్శించి పైపులైన్ల పరిస్థితిని పరిశీలించారు. కొన్ని చోట్ల లీకేజీలు, పాత



పైపులైన్ల దెబ్బతినడం, తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మరమ్మత్తులు చేపట్టి, అవసరమైన చోట్ల కొత్త పైపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సర్పంచ్ అలువాల శంకర్ మాట్లాడుతూ, వేసవిలో గ్రామ ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా కృషి చేస్తున్నాం అని తెలిపారు. ఎంపిడిఓ, ఏఈలు పనులను వేగవంతంగా పూర్తి చేసి గ్రామంలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. గ్రామ ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా సంరక్షణలో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. ప్రజల సహకారంతో ఈ వేసవిలో నీటి సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామపంచాయతీ కట్టుబడి ఉందని తెలిపారు.

# ఈ నెల 17న వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు



**పాలకుర్తి, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పాలకుర్తి మండలంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శశికళ తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఐదు రోజులపాటు శిక్షణ తరగతులు జరుగనున్నాయి. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు చెందిన 155 వార్డు మెంబర్లకు ఈ శిక్షణ తరగతులు పాలకుర్తి రైతు వేదికలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడతాయి. శిక్షణ తరగతులకు హాజరయ్యే వార్డు మెంబర్లు ప్రతిరోజూ ఆధార్ కార్డుతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

# రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రత్యేక పూజలు

**ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామంలోని శ్రీ దుబ్బ రాజరాజేశ్వరస్వామి



ఆలయంలో నిర్వహించిన శాంతిహోమం, బలిహరణం, మహా పూర్ణాహుతి కార్యక్రమాల్లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, పార్టీ నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, ఎల్లందుల ప్రసాద్, కోలపురి అంతగిరి, సురేందర్ రెడ్డి, పాశం రాజేందర్, సుధగోని తిరుపతి గౌడ్, కేతిరెడ్డి వెంకటరెడ్డి, నవీన్, వల్లంపట్ల అనిల్, ఎం. రాజు, ప్రభాకర్, వెంకట్‌తో పాటు ఆలయ అర్చకులు పవన్ శర్మ, విఠల్ శర్మ పాల్గొన్నారు.

# ఘనంగా నల్లమలలో మల్లికార్జున స్వామి కళ్యాణం



**అమ్రాబాద్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నల్లమల అటవీ ప్రాంతంలోని భౌరాపూర్ చెంచుపెంటలో శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామివారి కళ్యాణ మహోత్సవం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో జరిగింది. చెంచు గిరిజనుల ఆచారాలు, వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కళ్యాణాన్ని వేలాది మంది భక్తులు వీక్షించారు. ఈ వేడుకలో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘనంగా సత్కారం చేశారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ, భౌరాపూర్ దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం అత్యవసరమని, భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, రోడ్డు, విశ్రాంతి గదుల కోసం తన ఎంపీ నిధుల నుండి రూ. 10 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, చెంచు గిరిజనులకు ఉపాధి కల్పించేలా, ఆలయ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అచ్చంపేట మున్సిపాలిటీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, మాజీ ఎంపీపీ రామనాథం, అమ్రాబాద్ సర్పంచ్ చిగుర్ల కోటయ్య, మాజీ ఎంపిటిసి దాసరి శంభో శోభ, జూలూరి సత్యనారాయణతో పాటు భక్తులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య ప్రమాణ స్వీకారం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి పట్టణంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు ఘనంగా జరిగాయి. ఇటీవల 21వ వార్డు నుండి గెలుపొందిన నూగిల్ల మల్లయ్య మున్సిపల్ చైర్మన్‌గా, 36వ వార్డు నుండి గెలుపొందిన ముస్కాన్ నాజ్ వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రీసిడింగ్ అధికారి పెద్దపల్లి ఆర్‌డిఓ గంగయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, కిరణ్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, టీఓటీ కృష్ణ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన ఫార్వర్డ్ బ్లాక్ కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం

**కరీంనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున సింహం గుర్తుపై గెలుపొందిన 15వ డివిజన్ కార్పొరేటర్ విపుల సాయి జ్యోతి, 27వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల ప్రమాణ స్వీకారానికి బయలుదేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలు కప్పి, ఎంట్రీ పాస్‌లతో వారిని కరీంనగర్ కార్పొరేషన్ కార్యాలయానికి పంపినట్లు ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విజిలెన్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు

### వెలిచాల రాజేందర్ రావు




**కరీంనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక విజిలెన్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ప్రకటించారు. సోమవారం సాయంత్రం జిల్లా డిసిసి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చిన్న అవినీతి జరిగినా విడిచిపెట్టే ప్రసక్తి లేదని, ప్రతి డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనులు, బిల్డింగ్ పర్మిషన్లు, ఇతరత్రా పనులపై పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి పని, ప్రతి పేమెంట్‌ను మానిటరింగ్ చేసి నాణ్యత పరిశీలించి ప్రభుత్వం బిల్లులు చెల్లించేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ పాలకవర్గం పారదర్శకంగా పాలన సాగించాలని, అవినీతి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారిని మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు ఎంపిక చేయడం ప్రజల్లో భయాందోళన కలిగిస్తోందని విమర్శించారు. కార్పొరేషన్‌లో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పటికీ, కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని రాజేందర్ రావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు, బిల్డింగ్ పర్మిషన్లు, ప్రజా అవసరాలకు ఎలాంటి డబ్బులు ఆశించకుండా పారదర్శకంగా పాలన సాగించాలని బీజేపీ పాలకవర్గానికి సూచించారు. ఒకవేళ అవినీతి జరిగితే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సన్న, భాస్కర్ నాయక్, గుమ్మడి రాజకుమార్, ఆకుల నందిని ఉదయ్, పడిశెట్టి వసంత లక్ష్మి, కల్లేపల్లి శారద, సికిందర్ ఇక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు న్యాయవాదుల విధుల బహిష్కరణ




**కరీంనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన న్యాయవాది మొహమ్మద్ అబ్దుల్ ఖాదీర్ దారుణ హత్యకు నిరసనగా కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు కోర్టు పనులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా న్యాయవాదుల భద్రతకు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పెంచల ప్రభాకర్ రావు, కొరివి వేణుగోపాల్, లక్మన్ రావు, పి. రంగయ్య, వేణుగోపాల్ రావు, కె. లక్మి నర్సయ్య, కొత్త నర్సింహా రెడ్డి, బొజ్జ స్వామి, ఆనంద్, కె. లక్ష్మణ్, కె. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా యాప్ ద్వారా అమ్మకాలు



**కరీంనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో రైతులకు యూరియా సరఫరా సులభతరం చేయడానికి యూరియా యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరుగుతున్నాయి. జనవరి 31 నుండి ప్రారంభమైన ఈ విధానం ద్వారా ఇప్పటివరకు 51,936 మంది రైతులు 1,72,191 యూరియా బస్తాలను బుక్ చేసుకున్నారు. వాటిలో 1,43,933 బస్తాలను ఇప్పటికే కొనుగోలు చేశారు. జిల్లాలో ప్రస్తుతం 725 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ ప్రమీల సత్పతి తెలిపారు. రైతులు యాప్ ద్వారా సులభంగా యూరియా బుక్ చేసుకుని, అందుబాటులో ఉన్న డీలర్ వద్ద కొనుగోలు చేయవచ్చని ఆమె పేర్కొన్నారు.

## పాలకవర్గ సభ్యులుగా బీఆర్ఎస్ కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం



**కరీంనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన తొమ్మిది మంది అభ్యర్థులు నేడు పాలకవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా 34వ డివిజన్‌లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచిన సమీనా పర్వీన్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికిన జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆమనగల్లు చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మున్సిపాలిటీ పదవి కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్ళింది. ఆ పార్టీ కౌన్సిలర్ లెనోవా పత్యా నాయక్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. 15 కౌన్సిలర్ తో పాటు ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో ఓటు పోలింగ్ నిర్వహించారు. పద్య నాయక్ అభ్యర్థిత్వాన్ని బిజెపి ప్రతిపాదించగా కాంగ్రెస్ బలపరిచింది. టిఆర్ఎస్ పార్టీ తరఫున 5 వార్డు కౌన్సిలర్లు పాపి శెట్టి రాము పేరును ఆ పార్టీ ప్రతిపాదించి బలపరిచింది. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు చేతులు ఎత్తే విధానంలో ఎన్నికలు నిర్వహించగా 9 మంది ( బిజెపి ఆరు, కాంగ్రెస్ రెండు, ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియల్ 1 ) పత్య నాయకు అనుకూలంగా ఓటు వేశారు. అటు బి ఆర్ ఎస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి పాపిశెట్టి రాము కు ఏడు ఓట్లు పోలయ్యాయి. దీంతో పత్య నాయక్ రెండు ఓట్ల తేడాతో చైర్మన్ పదవికి ఎన్నికయ్యారు. అనంతరం వైస్ చైర్మన్ పదవికి మూడవ వార్డు అభ్యర్థి తల్లోజు గీత పేరును ప్రతిపాదించగా బిజెపి, కాంగ్రెస్ కౌన్సిలర్లు అనుకూల ఓట్లతో నెగ్గారు. దీంతో కాంగ్రెస్, బిజెపి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు హర్షతి రేకం వ్యక్తం చేశారు.

## ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్‌గా పత్య నాయక్ ప్రమాణ స్వీకారం






**ఆమనగల్లు, ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ గా పత్య నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో భారీ భద్రతల మధ్య ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులందరి చేత ప్రమాణం చేయించిన అనంతరం చైర్మన్ గా పత్య నాయక్ తో అధికారులు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కొత్తగా పాలకవర్గం బాధ్యతలు చేపట్టారు.

## ఆమనగల్లు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గా తల్లోజు గీత



**ఆమనగల్లు, ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో మూడవ వార్డు కౌన్సిలర్ తల్లోజు గీత మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. అధికారులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకుల సమక్షంలో ఆమె పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఈ సందర్భంగా గీత తెలిపారు.

## ప్రముఖ వ్యాపారవేత్త కన్నుమూత



**ఆమనగల్లు, ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కండె లింగయ్య సోమవారం ఉదయం తన నివాసంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజకీయ నాయకులు, ఆయన నివాసానికి చేరుకొని నివాళి అర్పించారు. తన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబాన్ని ఓదార్చారు.

## విచారణకు ముందే చెట్లు మాయం



**హుస్నాబాద్ , ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో చెట్లు కనిపించకుండా పోవడం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. అధికారుల దృష్టికి వెళ్లకముందే చెట్లను వేర్లతో సహా తొలగించడం, మాయం చేయడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గ్రామస్థుల సమాచారం ప్రకారం, వస్తాదుల విజయ్ తన సొంత భూమిలో కరెంటు స్తంభాలను ఇష్టాసారంగా ఏర్పాటు చేయడం, రోడ్డు పక్కన భూమి ఉన్నప్పటికీ తన భూమిలోకి ఆరు అడుగులు దూరం వెళ్లి దౌర్జన్యంగా పనులు చేయడం ప్రజల్లో అసంతృప్తి కలిగించింది. చెట్లను వేర్లతో సహా తొలగించడం, ఎక్కడికి తరలించారన్నది ఇంకా స్పష్టత రాలేదు. రైతులు చెబుతున్నదేమిటంటే, తమ సొంత భూమిలో చెట్లకే విలువ లేకపోతే రేపటి రోజుల్లో రైతులను మానసికంగా వేధించే పరిస్థితులు తలెత్తవచ్చని. ఈ ఘటనపై అధికారులు తగిన చర్యలు తీసుకుని, రైతులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పురపాలక పరోక్ష ఎన్నికలకై పటిష్ట భద్రత




**కరీంనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, అలాగే మున్సిపాలిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పరోక్ష ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మున్సిపల్ కార్యాలయాల పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిషేధాజ్ఞలు అమలు చేశారు. ఎన్నికల కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచి, కార్యాలయాల సమీపంలో గుమిగూడటంపై నిషేధం విధించారు. భద్రతా కారణాల దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపులు కూడా చేపట్టారు. సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగాలని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు, రాజకీయ ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు




**కరీంనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల అనంతరం బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. మేయర్ పదవి బీజేపీకి రాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా ఇతర పార్టీలు కుట్రలు పన్నాయని ఆరోపించారు. మీరు మొదలుపెట్టిన ఆటకు నేను ముగింపు ఇస్తా. బీజేపీ సైనికుల పోరాటం ముందు మీ కుట్రలు పటాపంచలయ్యాయి. 6 గ్యారంటీల అమలుపై ఇక రిక్వెస్టులు లేవు, మీ మెడలు వంచేదాకా పోరాటం కొనసాగుతుంది అని సంజయ్ వ్యాఖ్యానించారు. కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా, సునీల్ రావు డిప్యూటీ మేయర్‌గా ఎన్నిక కావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేయాలనే కార్యకర్తల కల నెరవేరింది. ప్రజల ఆశీర్వాదం, అమ్మవారి దీవెనలతో బీజేపీ విజయం సాధించింది అని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలయిక ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని, ఫాంహౌజ్ వేదికగా జరిగిన చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారని సంజయ్ అన్నారు. మేయర్ ఎన్నికలో బీజేపీ గెలుపు రాష్ట్రంలో అధికార మార్పుకు సంకేతం అని పేర్కొన్నారు.

## హుజూరాబాద్ మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా



**హుజూరాబాద్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దశాబ్దాల తర్వాత హుజూరాబాద్ మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరింది. ఈ విజయంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. చైర్మన్‌గా రోంటాల సుహాసిని, వైస్ చైర్మన్‌గా గూడూరి అంజలి ఎన్నికయ్యారు. అభ్యర్థుల ఎంపిక నుండి ప్రచారం వరకు తనదైన శైలిలో సమన్వయం చేసిన నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి విజయాన్ని సాధించారు. ప్రమాణ స్వీకారం అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్నికల్లో గెలిచిన కౌన్సిలర్లను ఘనంగా సన్మానించిన నాయకులు, ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ప్రధాన లక్ష్యమని, హుజూరాబాద్‌లో ఇకపై జరిగే ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ జెండానే ఎగరుతుందని పేర్కొన్నారు.

## మ్యూజియం పునరుద్ధరణ పనులను పరిశీలన

### అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ




**కరీంనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ ఐఏఎస్ కరీంనగర్ సైన్స్ మ్యూజియం, ఉమ్మడి జిల్లా పరీక్షల బోర్డు ప్రశ్నాపత్రాల తయారీ వర్క్‌షాప్‌ను సందర్శించారు. మ్యూజియం పునరుద్ధరణ పనులను పరిశీలించిన ఆమె విద్యార్థులకు ఉపయోగపడే సైన్స్, ఆర్ట్, కల్చర్ అంశాలను మరింతగా చేర్చాలని సూచించారు. మ్యూజియం కేవలం వస్తు ప్రదర్శనగా కాకుండా విద్యార్థులకు జ్ఞాన కేంద్రంగా ఉండాలని, సందర్శించే వారు కొత్త విషయాలు నేర్చుకునేలా తీర్చిదిద్దాలని అన్నారు. తదుపరి ప్రశ్నాపత్రాల తయారీ కార్యశాలను సందర్శించి, ప్రశ్నపత్రాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, విద్యార్థులు ఆలోచించేలా ఉండాలని సూచించారు. పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలను యథాతథంగా అడగకుండా, భావదోషాలు లేకుండా ప్రశ్నలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్ రెడ్డి, పరీక్షల బోర్డు కార్యదర్శి భగవంతయ్య, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రవీందర్, స్టేట్ రిసోర్స్ పర్సన్ గాజుల రవీందర్, ఉమర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావు

**కరీంనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి సామాన్య కార్యకర్తకు దక్కింది. భారతీయ జనతా పార్టీ తరపున 2వ డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ మేయర్ అభ్యర్థిగా, మాజీ మేయర్ సునీల్ రావు డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు పేర్లను ఖరారు చేశారు. ఈ మేరకు లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి లేఖను కరీంనగర్‌కు తీసుకువచ్చి, వి. కన్వెన్షన్‌లో జరిగిన బీజేపీ కార్పొరేటర్ల సమావేశంలో జిల్లా ఇన్చార్జి డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డికి అందజేశారు. అనంతరం 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్, 62వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపల్లి శ్రీలేఖ మేయర్ అభ్యర్థిగా శ్రీనివాస్ పేరును ప్రతిపాదించగా, 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు, 51వ డివిజన్ కార్పొరేటర్ భండారి వేణు డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా సునీల్ రావు పేరును ప్రతిపాదించారు. కార్పొరేటర్లందరూ ఏకగ్రీవంగా ఆమోదం




తెలిపారు. తరువాత ప్రత్యేక బస్సులో కార్పొరేటర్లు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ప్రమాణ స్వీకారం చేశారు. ఏబీవీపీ నుండి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి, అంచెలంచెలుగా ఎదిగిన కొలగాని శ్రీనివాస్ మేయర్ పదవికి ఎంపిక కావడం పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. 37 ఏళ్ల శ్రీనివాస్ విద్యార్థి దశ నుండే ఆర్ఎస్ఎస్, ఎన్ఎస్ఎస్, యువజన సంఘాల్లో చురుకుగా పనిచేశారు. అనేక జాతీయ శిబిరాల్లో పాల్గొని సేవా కార్యక్రమాల్లో ముందుండారు. 2010లో కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ వలంటీర్ అవార్డు, 2021లో కరోనా కాలంలో రక్షక్ అవార్డు అందుకున్నారు. 2014 నుండి 2019 వరకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా, 2020 నుండి 2025 వరకు కార్పొరేటర్‌గా, 2024లో నీఫ్ఫా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2025లో చొప్పదండి మండల సర్పంచ్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. ఇటీవల 2వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలుపొందారు. మేయర్‌గా శ్రీనివాస్ ఎంపికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కార్యకర్తకు మేయర్ పదవి దక్కడం బీజేపీ విధేయతకు నిదర్శనమని పేర్కొన్నారు.

# బీజేపీ కార్పొరేటర్లకు ఘన స్వాగతం





**గన్నేరువరం, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌తో పాటు కరీంనగర్ మున్సిపల్‌లో గెలిచిన బీజేపీ కార్పొరేటర్లు హైదరాబాదు నుండి కరీంనగర్ మున్సిపల్ కార్యాలయానికి బయలుదేరిన సందర్భంగా గన్నేరువరం మండల బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**మానకొండూర్‌లో బీజేపీ సంబరాలు**

కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావు ఎన్నిక కావడంతో మానకొండూర్‌లో బీజేపీ శ్రేణులు ఘనంగా సంబరాలు జరిపారు. పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు.




నాయకులు మాట్లాడుతూ నగర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి, రాపాక ప్రవీణ్, అప్పని తిరుపతి, సంపత్ గౌడ్, లక్ష్మణచారి, శ్రీనివాస్ గౌడ్, సోన్నకుల శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, ఉషాకోయిల రమేష్, ప్రదీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**శంకరపట్నంలో విజయోత్సవ ర్యాలీ**

కరీంనగర్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడంతో శంకరపట్నం మండలంలో విజయోత్సవ సంబరాలు జరిగాయి. మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చారు. జిల్లా ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం కరీంనగర్ నుండి ప్రారంభమైనట్లుగానే బీజేపీ జైత్రయాత్ర కూడా ఇక్కడి నుండే మొదలైంది. సామాన్య కార్యకర్తను మేయర్ స్థాయికి తీసుకెళ్లిన ఘనత బీజేపీకే దక్కింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, బూత్ అధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌కు శివజ్యోతి ఎంపిక



**కరీంనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఈ నెల 19న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌కు కరీంనగర్ జిల్లా జ్యోతి ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ గణిత ఉపాధ్యాయిని అక్కినపల్లి శివజ్యోతి ఎంపికయ్యారు. గత 25 సంవత్సరాలుగా గణిత బోధనలో అనుభవం కలిగిన ఆమె, గణితం కేవలం ఫార్ములాలు గుర్తుపెట్టుకోవడం కాదని, ఆ ఫార్ములా ఎందుకు పనిచేస్తుంది? ఎక్కడ ఉపయోగపడుతుంది? అనే విషయాన్ని విద్యార్థులు అర్థం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ అంశాలపై ఆమె రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి వేదికగా సెమినార్‌లో ప్రసంగించనున్నారు. ఈ విజయంపై రాష్ట్ర హెడ్మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నలమాచు సుదర్శనం, కెమిస్ట్రీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కమటాల రామ్మోహన్, భరోసా సంస్థ అధ్యక్షుడు నాగరాజు, ఎంఈఓ హరిప్రసాద్, సతీష్ బాబు, విజయ ప్రసాద్, వేణుగోపాల్ తదితరులు శివజ్యోతిని అభినందించారు.

## జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి వాణి




**జగిత్యాల, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. 43వ వార్డు కౌన్సిలర్ సమీండ్ల వాణి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రత్యేక అధికారి మదన్ మోహన్ ఆధ్వర్యంలో 50 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఒకరు ఇంగ్లీష్‌లో, ముగ్గురు ఉర్దూలో, మరో ముగ్గురు చదువు రాకపోవడంతో అధికారి స్వయంగా ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్‌పర్సన్ పదవికి కాంగ్రెస్ అభ్యర్థి వాణిని 18వ వార్డు కౌన్సిలర్ కుమార్తె శేఖర్ ప్రతిపాదించగా, 27వ వార్డు కౌన్సిలర్ జంబర్తి గంగలక్ష్మి బలపరిచారు. బీజేపీ అభ్యర్థి అరుణను 45వ వార్డు కౌన్సిలర్ గట్టెపెల్లి మానస ప్రతిపాదించగా, 5వ వార్డు కౌన్సిలర్ వేముల శ్రీనివాస్ బలపరిచారు. వాణికి 39 ఓట్లు లభించగా, బీజేపీ అభ్యర్థికి కేవలం 5 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఎంఐఎం కౌన్సిలర్లు ఇద్దరు, బీజేపీ రెబల్స్ ముగ్గురు, ఇండిపెండెంట్లు 14 మంది కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారు. బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు, కాంగ్రెస్‌కు చెందిన ఒకరు ఓటు వేయకపోవడం చర్చనీయాంశమైంది. వైస్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి 35వ వార్డు కౌన్సిలర్ జీనత్ పర్వీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## శ్రీ భవాని రామలింగేశ్వర ఆలయంలో మహా అన్నప్రసాద వితరణ




**ఎలిగేడు, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీ భవాని రామలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మహా అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.అన్నప్రసాద దాతలు బూర్ల తిరుపతి--రాజేశ్వరి, మెరుగు శ్రీధర్--శ్రావ్య, బూర్ల రామ్మోహన్--శ్రీవాణి దంపతులు గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతి యేటా మహాశివరాత్రి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ ముంజం నరేశ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..



**యాచారం, ఫిబ్రవరి 16( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** యాచారం మండలం లోని 33 కెవి యాచారం సబ్ స్టేషన్ పరిదిలో ఉన్న --ఈ 11 కేవి చౌదర్ పల్లి ఫీడర్ పైన విద్యుత్ మరమత్తులు (మెంటెనెన్స్) మరియు చెట్ల కొమ్మలను తొలగించడం కారణంగా నేడు (మంగళవారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ ఫీడర్ పరిధిలో ఉన్న యాచారం రెవెన్యూ, గున్గల్ రెవెన్యూ, ధర్మన్న. గూడ మరియు చింతుల్ల రైతులకు, చౌదర్ పల్లి గ్రామస్థులు మరియు వ్యవసాయ పోలాలకు, పౌల్ట్రీ ఫార్మ్ కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఏ ఈ సుధీర్ ప్రకటనలో పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు మరియు రైతులు ఇట్టి విషయాన్ని గమనించి సహకరించగలరని తెలిపారు .

### ఏడు రోజుల క్యాంపు ముగింపు కార్యక్రమం...



**కడ్తాల్, ఫిబ్రవరి 16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** ఫలక్ నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాల హైదరాబాద్ వారు కడ్తాల్, కందుకూరు మండలంలోని అన్మాస్ పల్లి, పుల్లేరుబోడు తండా, సాయిరెడ్డి గుండెం గ్రామాల్లో 7 రోజుల పాటు నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ క్యాంప్ సోమవారం ది ఎర్త్ సెంటర్ లో ముగిసింది. ముగింపు సమావేశంలో ఫలక్ నుమా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రవీణ్ కుమార్ , కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి , అధ్యక్షురాలు శ్రీమతి లీలా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రవీణ్ కుమార్ గారు మాట్లాడుతూ ఎన్ ఎస్ ఎస్ అంటేనే నిస్వార్థ సేవకు, దేశభక్తికి నిదర్శనం, విద్యార్థులు విద్యతో పాటు శారీరికంగా, మానసికంగా స్థిరంగా ఉండాలని సూచించారు. అనంతరం డా శశికళ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో స్వచ భారత్, శ్రమదానం, పాఠశాలల్లో విద్యా బోధనా, వివిధ సామాజిక అంశాలమీద నాటికలు,ర్యాలీలా ద్వారా అవగాహన కల్పించడం. ఆరోగ్య శిబిరాని ఏర్పాటు చెయ్యడం. వంటి పలు రకాల సేవ కార్యక్రమాలు స్థానిక పోలీస్ శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పాలక మండలి వారి సహకారంతో నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ 1,2,3 ప్రోగ్రాం ఆఫీసర్స్ డా బాబు రావు, డా శశికళ, డా సరిత, మరియు సి జి ఆర్ సంస్థ ప్రతినిధులు నాగేష్, రజనీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ముగిసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

**- విజేత ముప్పిరితోట, రన్నర్ లాలపల్లి**

**ఎలిగేడు, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలో జీ స్కిల్స్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారం అట్టహాసంగా ముగిసింది. 12 జట్లు పోటీపడిన ఈ టోర్నీలో ఫైనల్ మ్యాచ్‌లో లాలపల్లి, ముప్పిరితోట జట్లు తలపడగా విజేతగా ముప్పిరితోట, రన్నర్‌గా లాలపల్లి నిలిచాయి. విజేతలకు రూ. 10 వేల నగదు, ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ. 7 వేల నగదు, ట్రోఫీ, తృతీయ స్థానంలో నిలిచిన ఎలిగేడు జట్టుకు రూ. 5 వేల నగదు, ట్రోఫీని అందజేశారు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున బహుమతులు అందజేశారు. యువతలో క్రీడాస్ఫూర్తి, ఐక్యత, నియమ నిబంధనల పట్ల గౌరవం, నాయకత్వ





నగదు బహుమతి ట్రోఫీ అందుకున్న ముప్పిరితోట, లాలపల్లె, ఎలిగేడు గ్రామాల క్రికెట్ జట్లు

లక్షణాలను పెంపొందించడమే ఈ టోర్నీ ఉద్దేశమని జీ స్కిల్స్ డెవలప్మెంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ముంజంపల్లి రమేష్, నిర్వాహకులు బాసంపల్లి వినోద్ తెలిపారు. విజేతలకు ఎలిగేడు, లాలపల్లి గ్రామాల సర్పంచులు కప్పల ప్రవీణ్, ఏలేటి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు, ఎలిగేడు ఉపసర్పంచ్ ముంజం నరేష్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాడ కొండల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా నగదు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతకుంట మనోహర్ రావు, నారాయణపల్లి మాజీ ఉపసర్పంచ్ సబ్బు శ్రీధర్, ఎలిగేడు ప్రభుత్వ పాఠశాల మాజీ విద్యా కమిటీ చైర్మన్ అడ్డగుంట తిరుపతి, న్యాతరి సంపత్, మారం రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# శివాలయం దగ్గర అన్న ప్రసాదం వితరణ




**ఇబ్రహింపట్నం , ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్ :** యాచారం మండల పరిధిలోని నక్కర్త మేడిపల్లి మహా శివరాత్రి సంద్భంగా శివాలయం దగ్గర అన్న ప్రసాదవితరణ గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ , ఉప సర్పంచ్ దేంది మధుకర్ రెడ్డి, 10వ వార్డు సభ్యులు కల్కొండ పద్మ బీరప్ప కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వీరన్న గుట్టపై ఉన్న పురాతన శివాలయం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి వారి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... పురాతనమైన శివాలయం తిరిగి నా ఆధ్వర్యంలో పునః ప్రారంభం కావడం ఈ జన్మకు నేను చేసుకున్న పుణ్యము అని తెలియజేస్తున్నాను. గుడి అభివృద్ధికి రాజకీయాలకతీతంగా అందరూ కలిసి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి, అన్న ప్రసాదాన్ని స్వీకరించి నందుకు సంతోషం వ్యక్తం చేశారు . రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని ఏటువంటి ప్రకృతి వైపరీత్యాలు జరగకుండా ఉండాలని ప్రజల సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు ముచ్చర్ల మాదవి, ఏర్కలి జ్యోతి, అందుకర్ అనిల్, మక్కపల్లి మహేష్, బూరె కలమ్మా, కలకొండ పద్మ, బూరె సురేందర్, గ్రామ మాజీ సర్పంచ్ ఎరుకలి .బాలరాజు గౌడ్ , మాజీ ఎంపీపీ మెటే శ్రీశైలం,ూ౦+ ఫౌండేషన్ చైర్మన్ఆడాల గణేష్ వరలక్ష్మి,గ్రామ పెద్దలు కర్నాటి అరుణమ్మ , విశ్రాంతి ఉపాధ్యాలు బొగ్గుల పాపిరెడ్డి, జేఏసీ నాయకుల కలకొండ అంజయ్య,ూ=+ ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరీ రవీందర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# తీదేడు గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజలందరూ సహకరించాలి

**ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తీదేడు గ్రామ సర్పంచ్**



**దేవరకొండ ఫిబ్రవరి 16. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** చింతపల్లి మండలం లో ని తీదేడు గ్రామం లో సోమవారం గ్రామ సభ నిర్వహించారు . సభలో సూచించిన సమస్యలనే ఆధారంగా చేసుకొని పరిష్కార దిశగా మన గ్రామ ప్రయాణం కొనసాగుతుందని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. తీదేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,పారిశుద్ధ్య నిర్వహణ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా రోడ్ల సంక్షేమం అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నయని ఆమె పెర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని ఆమె అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ అభివృద్ధి అని ఆమె అన్నారు. గ్రామ ప్రజల భాగస్వామ్యమే మన గ్రామ బలము మన అభివృద్ధికి పునాది అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం సహకరిస్తున్న ప్రతి ఒక్క గ్రామవాసికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్యదర్శి అశోక్,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య,రెడ్డి పద్మ పరమేష్,సందె లక్ష్మయ్య,మర్ల యాదగిరి,శివర్ల పర్వతాలు యాదవ్,గ్రామ వైద్యాధికారి,అంగన్వాడి టీచర్లు,ఏ.యన్.యం,ఆశావర్కర్లు, విద్యుత్ సంబంధిత అధికారులు, గోపాల మిత్ర, ఉపాధి హామీ పీల్డ్ అసిస్టెంట్,వెలుగు,గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామ పెద్దలు,గ్రామ యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వర ఆలయంలో ఘనంగా శివకేశవుల కళ్యాణం






**వినోభా నగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణం, శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని తిరుకల్యాణ మహోత్సవం వేదపండితుల నేతృత్వంలో అంగరంగ వైభవంగా జరిగింది. పండితులు శివపార్వతుల, తిరుకల్యాణ విశిష్టతను భక్తులకు వివరించి ఆధ్యాత్మికతను చాటారు. పుర ప్రముఖులు, ఆలయ కమిటీ



సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహాశివరాత్రి సందర్భంగా చెరుకు రసం, రత్నపురి గడ్డ, పండ్లు, తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఇమ్మడి లక్ష్మీనారాయణ చెరుకు రసం, ఇల్లెందుల సంతోష్ కజ్జూర్ పండ్లకు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. 500 మందికి పైగా భక్తులు ఉత్సాహంగా పాల్గొని శివకేశవుల కళ్యాణాన్ని దర్శించి అనుగ్రహం పొందారు.

# హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం





**- రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కల్ పహాడ్ గేటు సమీపంలో రెండు కార్లు డీకొని ఇద్దరు దుర్మరణం, ఒకరి పరిస్థితి విషమమం**
**- మృతులు నరేంద్రచారి, ఎస్కె సైదులు, హయత్ నగర్ వసులుగా గుర్తింపు**

**కడ్తాల్, ఫిబ్రవరి 16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :** హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కల్ పహాడ్ గేటు సమీపంలో రెండు కార్లు ఎదురుదుగా డికొన్నాయి. ప్రమాదంలో నరేంద్రచారి, ఎస్కె సైదులు అక్కడికక్కడే దుర్మరణం చెందాగా వంగ సంతోష్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పలువురు గాయపడినట్లు సమాచారం. విరంతా హైదరాబాద్ నగరానికి చెందిన వారే.. మృతులు ఇద్దరు హయత్ నగర్ ప్రాంతానికి చెందినవారు. ఒక కారు శ్రీశైలం వెళుతుండగా మరో కారు శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళుతున్న క్రమంలో మార్గమధ్యలో ప్రమాదానికి గురైయ్యాయి. ప్రమాద స్థలానికి చేరుకున్న కడ్తాల్ పోలీసులు ధర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. మరి కొందరిని చికిత్స కోసం నగరానికి తరలించారు.

# బిసిలకు 42శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలి

**-సర్పంచ్, ఉపసర్పంచులను సన్మానించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు,ఆర్ .కృష్ణయ్య**



**దేవరకొండ ఫిబ్రవరి 16. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నేడు దేవరకొండ నియోజక వర్గంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ,సామాజికవేత్త, డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణ విచ్చేసి, మాట్లాడారు. బీసీల కుల గణన చేయాలని, 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించిన తర్వాతే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నూతన ప్రజా ప్రతినిధులు అయిన సర్పంచులకు ,ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లకు మెమెంటో, సాల్వాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ప్లాస్టిక్ వినియోగం దాని పర్యావసనాలు అనే అంశము పై వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మేమెంటో, ప్రశంసా పత్రం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ అరుణ్ కుమార్, వరికుప్పల శ్రీను, వెంకటయ్య, ఏరుకొండ రాము, చోల్లేటి భాస్కరాచారి, భీమగోని శివ గౌడ్ , చెరుపల్లి జయలక్ష్మి, వనం చంద్రకళ , కొంద్ర శ్రీశైలం యాదవ్ ప్రజా ప్రతినిధులు అయిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు,బిసి సంఘ కార్యకర్తలు, నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండలో ప్రజలకోసం పోలీస్ " పోలీస్ నిఘా"తెలుగు దినపత్రిక డైరీ ఆవిష్కరణ






**దేవరకొండ ఫిబ్రవరి 16.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో "పోలీస్ నిఘా" 2026 నూతన సంవత్సర డైరీని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డి.ఎస్.పి మరియు దేవరకొండ సి.ఐ , గుండ్లపల్లి (డిండి )సి.ఐ ముఖ్య అతిథులుగా పాల్గొని డైరీని విడుదల చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజలకు మరియు పోలీసులకు మధ్య వారధిగా ఉంటూ, సమాజంలో నేరాల నియంత్రణకు ఇలాంటి ప్రచురణలు దోహదపడతాయని పేర్కొన్నారు.పోలీస్ శాఖకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, అత్యవసర నంబర్లు మరియు నిఘా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ డైరీ రూపొందించబడింది.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఆర్టీఐ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర. కిషన్ నాయక్ మరియు "పోలీస్ నిఘా" పులిజాల గోవర్ధన్ డివిజన్ రిపోర్టర్, రాపోలు మోహన్ నల్గొండ జిల్లా ఇన్చార్జ్ , ప్రజాధర్బార్ నియోజకవర్గ ఇన్చార్జి పేర్ల మహేష్ , ప్రజా వాయిస్ దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ వింజమూరి సత్యనారాయణ పాల్గొన్నారు. అధికారులు డైరీని ఆవిష్కరించిన అనంతరం "పోలీస్ నిఘా" ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైభవంగా శివ పార్వతుల కల్యాణ మహోత్సవం

**-ఆలయ ధర్మకర్త ఎట్టయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహణ**
**-పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**





**కడ్తాల్, ఫిబ్రవరి 16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండల పరిధిలోని ఎక్వాయిపల్లి - ముద్విన్ గ్రామాల సమీపంలో మల్లన్న గుట్టపై వెలసిన మల్లికా ర్జునస్వామి ఆలయంలో మల్లికార్జున స్వామి కళ్యానోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయం మల్లన్న నామస్మరణ మార్మోగింది. ఆహ్లాదభరితమైన వాతావ రణలో ఏటా మహాశివరాత్రికి ఉత్సవాలు నిర్వహించడం సంప్రదాయం. స్వామివారి కల్యాణానికి కడ్తాల్ మండల ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన ధర్మకర్త ఎట్టయ్య యాదవ్ ఆధ్వర్యంలో అర్ధరాత్రి శివ పార్వతుల కల్యాణోత్సవం, ఒగ్గుకథ నిర్వహించారు. తెల్లవారుజామున అగ్నిగుండాల మహో త్సవం నిర్వహించారు. నేడు ప్రత్యేక పూజలు, రాత్రికి రథోత్స వం. 18న ప్రత్యేక అర్చనలు, విశేషపూజలు, దోపోత్సవం, 19న చక్రతీర్థం, ఒగ్గుకథతో మల్లన్న ఉత్సవాలు ముగిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# సన్నాలకు బోనస్

**మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా**



**కడ్తాల్, ఫిబ్రవరి 16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. క్వింటాల్కు రూ.500 బోనస్ కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.514.36 కోట్లు విడుదల చేసిందని ఆమనగల్లు మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా ముదిరాజ్ తెలిపారు. వానాకాలం సీజన్లో సన్నాలు అమ్మిన రైతుల ఖాతాల్లో ఈ డబ్బులు జమ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ఈ బోనస్ అదనంగా లభించనుందన్నారు. రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందాన్నారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తాం

**-అభిమానాన్ని వమ్ము కానివ్వకుండా, మరింత బాధ్యతతో,మరింత కట్టుబాటుతో పనిచేస్తాం.**
**-నేనావత్ బాలు నాయక్.**





**దేవరకొండ ఫిబ్రవరి 16.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో రమణా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మరియు కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రకమంలో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొని,మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు కి, వైస్ చైర్మన్ జూవేరియా తబస్సుమ్ కి, కౌన్సిలర్ లకు పుష్పగుచ్ఛం అందజేసి,హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు , వైస్ చైర్మన్ జూవేరియా తబస్సుమ్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియను గౌరవిస్తూ, మున్సిపాలిటీ అభివృద్ధికి బలమైన నాయకత్వం ఏర్పడాలని ఆకాంక్షించారు. నూతన ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితో దేవరకొండ పట్టణ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణ రెడ్డి , నూతన పాలక వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రిక్ బాక్సులు



**కల్వకుర్తి, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన జామెట్రిక్ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేలు, రబ్బర్లు అందజేశారు. తాండ్ర గ్రామానికి చెందిన కేతమళ్ళ అనిల్ తన తండ్రి కీ.శే. చిన్న హుస్సేన్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యలు అభ్యసించి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గౌరవం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు పాల్గొన్నారు. విద్యార్థులు ఈ సహాయాన్ని స్వీకరించి ఆనందం వ్యక్తం చేశారు.

## కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బృంగి రత్నమాల

### -వైస్ చైర్మన్‌గా శానవాజ్ ఖాన్



**కల్వకుర్తి, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో నూతన పురపాలక మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. వైస్ చైర్మన్‌గా శానవాజ్ ఖాన్‌ను కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులకు పార్టీ నాయకులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో, పురపాలక సంఘం కమిషనర్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా ముగిసిన ఉమా చంద్రమౌళీశ్వర స్వామి కళ్యాణం



**మానుకోట, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పవిత్ర మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మానుకోట జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు యుగేందర్ శర్మ, సహ అర్చకులు భరద్వాజ ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు జరిగాయి. సాయంత్రం వేళలో సన్నాయి మేళ తాళాల మధ్య స్వామివారి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి స్థానిక ఫారెస్ట్ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక అలంకరణలతో కళ్యాణ వేదికను ఏర్పాటు చేశారు. ప్రముఖ పురోహితులు గుడి రాధాకృష్ణమూర్తి, కౌశిక్ శర్మ నేతృత్వంలో కళ్యాణ మహోత్సవం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో జరిగింది. కంకణ దారుణం, యజ్ఞోపవీతం, జీలకర్ర--బెల్లం వితరణ, మంగళ మాంగల్యధారణ వంటి సంప్రదాయ క్రమాలు కన్నుల పండువగా జరిగాయి. హర హర మహాదేవ శంభో శంకర నామస్మరణతో కళ్యాణ రంగం మార్మోగింది. సుమారు 100 జంటలు కళ్యాణంలో కూర్చుండగా, అనంతరం దాతలు పూలమాలతో బంతి ఆడించడం విశేషంగా ఆకట్టుకుంది. కళ్యాణ దాతలు అందరికీ స్వామివారి శేష వస్త్రం, అమ్మవారి చీర అందించి సన్మానించారు. కార్యక్రమంలో దేవాదర్శన సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాన్ని స్వీకరించారు.

# వనపర్తి మూడో వార్డ్ కౌన్సిలర్ చీర్ల రజిని రాజీనామా

**వనపర్తి ఫిబ్రవరి 16(నీలగిరిఎక్స్‌ప్రెస్):**
వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన చీర్ల రజిని తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ ప్రత్యేక అధికారి, ఆర్డిఓ సుబ్రహ్మణ్యానికి అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు మున్సిపల్ ప్రత్యేక అధికారి సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ ఎన్నిక జరిగింది. ఆ తర్వాత చైర్మన్ వైస్ చైర్మన్ ల ప్రమాణ స్వీకారం అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన మూడోవార్డు కౌన్సిలర్ చీర్ల రజిని రాజీనామా పత్రాన్ని మున్సిపల్ ప్రత్యేక అధికారికి అందజేశారు. చైర్మన్ ఎన్నికల్లో తమకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ రాజీనామాపత్రాన్ని అందజేయడం చర్చ నీయాంశమైంది.

**కాంగ్రెస్ పార్టీకి రాజీనామా**

వనపర్తి మున్సిపల్ చైర్మన్ ఎన్నికలలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ మూడోవార్డు కౌన్సిలర్ భర్త,మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల చందర్ సోమవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి పంపుతున్నట్లు తెలిపారు. గత మూడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీని



కష్టకాలంలో కూడా కాపాడుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతో పాటు పడ్డామని అలాంటిది పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించకుండా కేవలం డబ్బున్న వారిని గుర్తించి పదవులను కట్టబెడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ కౌన్సిలర్లు ఎన్నిక అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధిక సంఖ్యలో కౌన్సిలర్లు గెలుపొందగా చైర్మన్ పదవిని పలువురు ఆశించారని, ఆశావాహులను కూర్చోబెట్టి అభిప్రాయాలు స్వీకరించకుండా ఏకపక్షంగా సీల్డ్ కవర్ పేరుతో డబ్బు ఉన్నవారికి పదవిని కట్టబెట్టారని దీన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీలో ఇక కొనసాగలేమని ఆవేదన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

## దివ్యాంగురాలు నికితకు మొబైల్ ఫోన్ అందజేసిన ఎన్సి గ్రూప్



**జవహర్ నగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జవహర్ నగర్ సిపిఐ కాలనీలో నివసిస్తున్న నిరుపేద దివ్యాంగురాలు నికితకు మొబైల్ ఫోన్ అందజేసి ఎన్సి గ్రూప్ ఆఫ్ కంపెనీ సేవా కార్యక్రమం నిర్వహించింది. తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ గుత్తికొండ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్సి గ్రూప్ చైర్మన్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు వీర, కృష్ణ, తేజ, లక్ష్మి సహకరించారు. గ్రూప్ సభ్యురాలు లక్ష్మి మాట్లాడుతూ తన మనమాడి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గుత్తికొండ కిరణ్ మాట్లాడుతూ లక్ష్మి గారు గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆపదలో ఉన్న కుటుంబాలకు సహాయం చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జగన్, ప్రశాంత్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, స్థానిక సీనియర్ జర్నలిస్టులు, బలగం సీఈవో చింతల విజయ్, దుర్గం స్వామి, రఘు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సహకారానికి దివ్యాంగుల తరపున మెరుగు శివకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# త్రిషా వార్నింగ్‌తో దిగివచ్చిన తమిళనాడు బీజేపీ చీఫ్..

### తన వ్యాఖ్యలపై క్షమాపణ

**చెన్నై ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తమిళ నటి త్రిషా వార్నింగ్‌తో పాటు, విమర్శల నేపథ్యంలో ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ నైనార్ నాగేంద్రన్ దిగివచ్చారు. త్రిషాపై చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన క్షమాపణలు చెప్పారు. పొరపాటు వల్ల తాను అలా అన్నట్లు వివరణ ఇచ్చారు. 'ఇది పొరపాటున చేసిన ప్రకటన. అఖిల భారత మహిళా విభాగం చీఫ్ వానతి శ్రీనివాసన్, అన్నామలై ఈ విషయం గురించి నాతో మాట్లాడారు. నా ప్రకటన వల్ల ఎవరైనా బాధపడి ఉంటే, నేను నా హృదయపూర్వక క్షమాపణలు తెలియజేస్తున్నా' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఇటీవల జరిగిన ఒక సభలో



తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత, నటుడు విజయ్‌ను తమిళనాడు బీజేపీ చీఫ్ నైనార్ నాగేంద్రన్ లక్ష్యంగా చేసుకున్నారు. విజయ్‌కు రాజకీయాల పట్ల కనీస అవగాహన లేదని, ఆయన కేవలం సినిమాల్లో డ్యాన్సులు వేసుకోవడానికే పరిమితమని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లోకి వచ్చే ముందు తన కుటుంబాన్ని చక్కదిద్దుకోవాలని సూచించారు. 'ఆయన (విజయ్) పూర్తిగా అనుభవం లేనివాడు. ముందు తన ఇంచి నుంచి ఆయన బయటకు రావాలి. ముందుగా త్రిష ఇంటి నుంచి బయటకు రా, అప్పుడు ఏదైనా జరుగుతుంది' అని నవ్వుతూ అన్నారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర చీఫ్ నైనార్ నాగేంద్రన్ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. నటి త్రిషా కూడా దీనిపై తీవ్రంగా స్పందించారు. 'రాష్ట్ర రాజకీయాల్లో ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తి ఇంత అసహ్యకరమైన, అనుచితమైన వ్యాఖ్యలు చేస్తారని ఎప్పుడూ ఊహించలేదు. రాజకీయాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నాకు సంబంధం లేని విషయాల్లోకి నా పేరు లాగవద్దు. లేకపోతే పరువునష్టం దావా వేయాల్సి ఉంటుంది' అని త్రిషా హెచ్చరించారు. ఆమె తరుపు న్యాయ సలహాదారులు సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

## విద్యుత్ శాఖ అధికారికి పోతేపల్లి సర్పంచ్ వినతిపత్రం




**వెల్దండ, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామానికి నాగర్‌కర్నూల్ విద్యుత్ శాఖ అధికారులు సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. అయితే పనులు ఆలస్యమవుతున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అంతరాయాల కారణంగా పంట పొలాలు ఎండిపోతున్నాయని, కరెంటు సమస్యలు పట్టిపీడిస్తున్నాయని రైతులు ఆవేదన చెందారు. ఈ నేపథ్యంలో పోతేపల్లి గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ విద్యుత్ శాఖ అధికారి (ఎస్.ఈ.ఈ)కి వినతిపత్రం అందజేశారు. సబ్‌స్టేషన్ పనులను రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని అత్యవసరంగా పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అశోక్ కుమార్, వావిళ్ల యాదగిరి, ఎగిరిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

# గాజాకు ఐదు బిలియన్ డాలర్ల సాయం

### శాంతి బోర్డు హామీ ఇచ్చిందన్న ట్రంప్

**వాషింగ్టన్ ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గాజాలో మానవతావాద, పునర్నిర్మాణ యత్నాల కోసం ఐదు బిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక సాయం అందించేందుకు 'శాంతి బోర్డు'లోని సభ్యదేశాలు హామీ ఇచ్చాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. బోర్డు సభ్యులు తొలిసారిగా వాషింగ్టన్‌లో గురువారం సమావేశమవుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రకటన చేశారు. ఆ సమావేశంలో సాయంపై ప్రకటన ఉంటుందని ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. గాజాలో భద్రత, శాంతి కోసం ఏర్పాటు చేసే అంతర్జాతీయ స్థిరీకరణ దళం, స్థానిక పోలీసింగ్ వ్యవస్థ కోసం వేలాది మంది సిబ్బందిని పంపేందుకు కూడా బోర్డులోని సభ్య దేశాలు



అంగీకరించాయని ఆయన తెలియజేశారు. బోర్డు సామర్థ్యం అపరిమితమైనదని ఆయన వ్యాఖ్యానించారు. 'ఈ నెల 19వ తేదీ నేను మరోసారి బోర్డు సభ్యులను కలుస్తాను. ఆ సమావేశంలోనే ఆర్థిక సాయంపై ప్రకటన వెలువడుతుంది' అని ట్రంప్ చెప్పారు. ప్రభుత్వ అధినేతలు సహా 20 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరవుతారని తెలిపారు. వాషింగ్టన్‌లోని డోనాల్డ్ జే.ట్రంప్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీస్‌లో సమావేశం జరుగుతుందని అన్నారు. అమెకా విదేశాంగ శాఖ ఇటీవలే యూఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీస్‌కు అధ్యక్షుడి పేరును చేర్చింది. కాగా శాంతి బోర్డులో 24 మందికి పైగా వ్యవస్థాపక సభ్యులు ఉండగా వారిలో ఎంతమంది సమావేశానికి హాజరవుతారో తెలియడం లేదు. గత వారం శ్వేతసౌధంలో ట్రంప్‌ను కలిసిన ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఈ భేటీకి రాకపోవచ్చునని తెలుస్తోంది. మధ్యప్రాచ్య దేశాలతో పాటు టర్కీ, ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్, ఇజ్రాయిల్, ఇండోనేషియాలు ఈ బోర్డులో సభ్యులుగా ఉన్నాయి.